డిసెంబరు 15, 2017

**– వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి,**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,
ప్రతిపక్ష నేత.

# ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ

**– ముదునూరి సుబ్బమ్మగారి మరణానికి బాధ్యులు మీరే**
**– రెండో సంతకం ఏమయింది? తొలి సంతకాలకు అర్థం ఏమిటి?**
**– ఏటా సగటున రూ.15,000 కోట్లు మద్యం మీదే సంపాదిస్తున్నారు**
**– ఏ ఒక్క రుణ మాఫీకీ డబ్బు ఇవ్వలేదు.**
**– ఫోన్ కొడితే మద్యం బాటిల్ వస్తోంది. మీరు సంతకం పెట్టిన మినరల్ వాటర్ బాటిల్ రావటం లేదు.**
**– చెప్పని వాగ్దానాలను కూడా అమలు చేయటం అంటే ఇదా?**
**– రాష్ట్రంలోని లక్షల కుటుంబాల్లో చిచ్చుపెట్టటం పరిపాలన అవుతుందా?**
**– నేరం చేయిస్తున్న మీకు భారీ శిక్ష తప్పదు**

పశ్చిమ గోదావరి జిల్లా పత్తేపురం గ్రామంలో మద్య వ్యతిరేక పోరాటం చేస్తూ మరణించిన ముదునూరి సుబ్బమ్మ గారికి నా తరపున, మా పార్టీ తరపున నివాళులు అర్పిస్తున్నాం. ఈమె మరణానికి కారణం– నేరుగా మీరే ముఖ్యమంత్రి గారూ.

గ్రామం మధ్యలో.. తమ ఇళ్ళ మధ్యన, మీ ప్రభుత్వ ఆశీర్వాదాలతో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తుంటే పత్తేపురం గ్రామస్తులు కొన్నాళ్ళుగా నిరసన తెలుపుతున్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు, అభిప్రాయాలకు పత్తేపురం ఆందోళన ఒక సూచిక మాత్రమే. రెండు రోజుల క్రితం చెరువులో దిగి సుమారు 20 మంది మహిళలు ఆత్మహత్యకు కూడా ప్రయత్నించారు. వారిలో శ్రీమతి ముదునూరి

సుబ్బమ్మ గారు ఒకరు. మీ ప్రభుత్వం చేస్తున్న అఘాయిత్యాన్ని తట్టుకోలేక గుండెపోటుకు గురై ఆమె మరణించారన్న విషయం గ్రామంలో ఎవరిని అడిగినా చెబుతారు. కాబట్టి ఈమెది సహజ మరణమా? లేక మీ దుర్మార్గం వల్ల సంభవించిన మరణమా?

బెల్టుషాపుల రద్దుకు సీఎం కాగానే సంతకం పెడతా అని మీరు ఎన్నికలకు ముందు చెప్పారు. మొదటి సంతకాలకు అర్థమేమిటి ముఖ్యమంత్రి గారూ..? డాక్టర్ వైయస్ఆర్ గారు ఉచిత విద్యుత్ ఫైలు మీద సంతకం పెడితే దాని అర్థం ఆరోజు నుంచి రైతులందరికీ ఉచిత విద్యుత్ లభిస్తుందనే. కరెంటు బకాయిలు రద్దు అంటే మొత్తంగా కరెంటు బకాయిలు అన్నీ ఆ క్షణం నుంచి రద్దు అయ్యాయనే. కానీ మీరు పెట్టిన సంతకానికి అర్థాలు వేరు. పూర్తిగా, బేషరతుగా వ్యవసాయ రుణ మాఫీ అని ప్రకటించి... రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలకు ఇప్పటికి కేవలం రూ. 12 వేలు కోట్లు కూడా ఇవ్వలేదు. రైతుల వడ్డీలు, చక్రవడ్డీలు లెక్క వేస్తే అవే మీ రుణ మాఫీ కన్నా నాలుగైదు రెట్లు ఎక్కువ ఉన్నాయి. బెల్టు షాపులన్నీ రెండో సంతకంతో రద్దు అన్నారు. బెల్టు షాపులు రద్దు కాలేదు సరికదా.. గ్రామాల్లో నివాసాల మధ్య, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, స్కూళ్ళ పక్కన మద్యం షాపులకు నాలుగు రెట్లు అనుమతులిచ్చిన ప్రభుత్వం మీదే.

ఈ ఏడాది మద్యం అమ్మకాల్లో మీరు అన్ని రికార్డులు బ్రేక్ చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నిన్నటివరకూ మీరు రూ. 11 వేల కోట్లకు పైగా మద్యం మీదే సంపాదించారు. నిరుడు రూ. 13,640 కోట్లు మద్యం మీద సంపాదిస్తే.. ఈ ఏడాది ఇప్పటికే రూ. 11 వేల కోట్లు దాటి రూ. 17 వేల కోట్లు దిశగా పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో మొబైల్ బెల్టు షాపుల ద్వారా ఇంటింటికీ, గొంతుగొంతుకీ దగ్గరగా.. ఫోన్ కొడితే మద్యం బాటిల్ వచ్చేటట్లు ఏర్పాటు చేశారు. డబ్బు కోసం మీరు ఎంతకైనా దిగజారుతారని చెప్పటానికి ఇంతకన్నా ఉదాహరణ కావాలా?

ఇప్పటికి రాష్ట్రంలో 24 మద్యం డిపోలు ఉంటే మరో 9 కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. దీని అర్థం ఏమిటి? మీ మేనిఫెస్టోలో చెప్పిన శ్రీరంగనీతుల సంగతేమిటి? మద్యం వల్ల కుటుంబాలు ఎలా సర్వనాశనం అవుతున్నాయో మీ పాదయాత్రలో మీరు చెప్పిన ప్రవచనాల సంగతేమిటి? మద్యం మీద మీరు సంపాదిస్తున్నది- ఈ ఏడాది రూ. 17 వేల కోట్లు, గతేడాది రూ. 13, 600 కోట్లు అంటే సగటున ఏటా రూ. 15 వేల కోట్లకు పైగా ప్రజల రక్తాన్ని తాగుతున్నారు. ఇంత డబ్బు గడిస్తూ నాలుగేళ్ళలో

కేవలం రూ. 11 వేల కోట్లే వ్యవసాయ రుణమాఫీకి ఇచ్చారంటే– మీది సంక్షేమ ప్రభుత్వమా? లేక రాక్షస ప్రభుత్వమా?.

డ్వాక్రా రుణాలు మొత్తం మాఫీ చేస్తామన్నారు. మీరు అధికారంలోకి వచ్చే నాటికి ఉన్నవి రూ. 14,204 కోట్లు. ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. మరి ఏటా రూ.15,000 కోట్ల చొప్పున ప్రజల రక్తాన్ని తాగుతూ ఏ ఒక్క రుణ మాఫీ కూడా చేయకపోవటం అంటే ఇది ప్రజలకు మీరు ఇచ్చే ప్రభుత్వమా, లేక ప్రజలనుంచి దోచుకునే ప్రభుత్వమా? ప్రతి ఇంటికీ రూ. 2 కే 20 లీటర్ల మినిరల్ వాటర్ ప్రతిరోజు ఇస్తామన్న మీ మొదటిరోజు సంతకం ఏమైందో తెలియదు. బెల్టు షాపులు ఎత్తివేయటమే కాకుండా.. ఆడబిడ్డల శాంతిభద్రతల కోసం రాష్ట్రంలోని మహిళందరికీ ఉచితంగా మొబైల్ ఫోన్‌లు ఇవ్వటంతోపాటు, కాల్ చేసిన 5 నిమిషాల్లోపే మహిళా రక్షణ టీములు వస్తాయని మీ మేనిఫెస్టోలో రాశారు. ఈ హామీలన్నీ ఏమయ్యాయి?

చెప్పనివి కూడా చేస్తాం అంటే.. ఫోన్ చేసిన 5 నిమిషాల్లో మద్యం బాటిల్ వచ్చే విధంగా ఏర్పాటు చేస్తాం అని అర్థమా ముఖ్యమంత్రి గారూ..? ఇప్పుడు అమలు అవుతున్న స్కీమ్ ఇదే కదా? మీరు పంపుతున్నది మద్యం బాటిల్ కాదు. అది కుటుంబాలలో చిచ్చు పెడుతున్న, మంటలు మండిస్తున్న పెట్రోల్ బాటిల్. ఈ విషయం మీకు తెలియదా ముఖ్యమంత్రి గారూ..?. పరిపాలన అంటే జనం బాగుండేలా నిర్ణయాలు తీసుకోవటం. మీ లంచాల కోసం ఖజానా బాగుండేలా నిర్ణయాలు తీసుకోవటాన్ని పరిపాలన అనరు ముఖ్యమంత్రి గారూ.. । మీ ఎక్సైజ్ మంత్రి బీరును హెల్త్ డ్రింక్‌గా అభివర్ణించి ప్రమోట్ చేస్తున్నారు. దీన్ని హెరిటేజ్ షాపుల్లో కూడా అమ్ముకుని మరిన్ని లాభాలు సంపాదించాలనే ఉద్దేశంతోనే మీ మంత్రితో ఆ 'హెల్త్ డ్రింక్' ప్రకటన చేయించారా? దాన్ని భవిష్యత్తులో హెల్త్ డ్రింక్‌గా ఆసుపత్రుల్లో కూడా అమ్ముతారా చంద్రబాబు గారూ..?

ఒక్క రోజులో ఏ ప్రభుత్వమూ మద్యాన్ని పూర్తిగా నిషేధించలేదు. దేశ వ్యాప్తంగా ఒక విధానం తీసుకువచ్చేలా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ అంగీకారానికి రావాలి. ఆ దిశగా ఆంధ్రప్రదేశ్ ముందడుగు వేయాలి. ఒకప్పుడు సిగరెట్ తాగే వారు చాలా ఎక్కువ శాతం ఉండేవారు. సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం, మీడియా భారీ స్థాయిలో ప్రచారం చేపట్టిన తర్వాత దాన్ని చాలావరకు తగ్గించగలిగాం. దేశవ్యాప్తంగా మద్యాన్ని తగ్గించి కుటుంబాల్లో సంతోషాన్ని, అనుబంధాల్ని పెంచే మద్య నిరుత్సాహ విధానాన్ని తయారు చేయాలన్నది మా ఉద్దేశం. ఇలాంటి ఆలోచనలు మీకు కలగకపోగా, విచ్చలవిడిగా

మద్యం అమ్మి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి కుటుంబానికీ మీరు చేస్తున్న ద్రోహం తరతరాల పాటు కుటుంబాల మీద దుష్ప్రభావం చూపుతుంది. తాగుతున్నది ప్రజలైనా ఇన్ని లక్షల కుటుంబాలను విచ్ఛిన్నం చేసేలా తాగిస్తున్నది మీరు. నేరం చేసినవాడికంటే చేయించిన వాడికి ఎక్కువ శిక్ష ఉండాలన్న సూత్రం ప్రకారం మీకు ఏ శిక్ష విధించినా తక్కువే కదా? పద్ధతి మార్చుకోండి చంద్రబాబుగారూ.